

# అదీ రహస్యం

అమరావతిని రాజధానిగా చేసుకొని వేంకటాద్రినాయనింగారు తెలుగు దేశాన్ని పాలిస్తున్నకాలమది. ఆ రోజులలో నీరుకొండ ప్రాంతానికి వల్లభరాయడుగారు అధికారిగా ఉండేవారు. అంతకుముందు వల్లభరాయుడుగారి నాన్నగారే ఆ పదవిలో ఉండేవారు. ఉండి ఆయనగారు రాజద్రోహం అంటూ ఏమీ చెయ్యలేదు. కానీ-ప్రజలను అంతో ఇంతో బాధించారని చెప్పుకొనేవారు. వారికి ఏదో కానుక కళ్ళబడనిదే సరియైన నిర్ణయాలను ప్రకటించేవారు కాదుట. కానుకల రూపంలోనే ఆయనగారు చాలా సంపాదించారని అందరూ గుసగుసలు పోతూ ఉండేవారు.

వారి తదనంతరం వారి పెద్దకుమారుడు వల్లభరాయుడుగారిని ముమ్మనాచార్యులవారు, ఆపదవిలో నియమించారు. అదిన్నీ ప్రభువుల అనుమతితోనే. వల్లభరాయుడుగారికి వారి నాన్నగారికీ ఏ విషయంలోనూ పోలికలేదు. వల్లభరాయుడు పండితుడు కాకపోవచ్చు గాని తండ్రిగారి కన్నా చదువుకొన్నవాడే.

ఆయన అధికారంలోకి వస్తూనే అంతకు ముందుదాకా తండ్రిగారు అనుసరిస్తూవచ్చిన ఎన్నో మార్పులను తీసుకొచ్చారు. ముఖ్యంగా కానుకల్ని స్వీకరించడమన్నది వల్లభరాయుడుగారికి బొత్తిగా సరిపడదు. అలాంటివారిని ఆయన నిరుత్సాహ పరిచారు. కొందరిని అదలించారు. ఇంకొందరిని బెదిరించారు కూడా,

పైగా శిస్తుల్ని, పన్నుల్ని కట్టలేనివారి విషయంలో రాయుడు గారు ఎంతో ఉదారంగా ప్రవర్తించేవారు. కొందరికి రాయితీలను కూడా ప్రకటించారు ఆయనగారు.

కవులను పండితులను సన్మానించారు. ఇందుకైన ఖర్చు లన్నింటినీ తన స్వంతనిధి నుండి వ్యయంచేశారు వారు. ప్రతిరోజూ తనను చూడవచ్చే బీదా బిక్కికి రాయుడుగారు రెండు చేతులా దానం చేశారు. ఇలా మాసాల పర్యంతం జరగడంవల్ల తండ్రిగారు సంపాదించిన డబ్బు యావత్తు తరిగిపోవడం ప్రారంభమయింది.

తీస్తూఉంటే కొండల్లాంటివే కరిగిపోతాయిగదా. ఇక వల్లభ రాయుడుగారి సంపద ఎంతకాలమని ఉంటుందిగనుక ?

ఈ విషయం ఆ నోటా ఆ నోటా నాయనింగారికి తెలిసింది. అక్రమంగా డబ్బు సంపాదించడం ఎంత అన్యాయమో, అనవసరంగా డబ్బును ఖర్చుచేయడం కూడా అంతే అన్యాయమని ప్రభువుల వారి అభిప్రాయం.

ఒకసారి ఏదోపనిమీద వచ్చిన వల్లభరాయుడుగారిని ప్రభువుల వారు ఉండగానే ఈ దాన ధర్మాలను గురించి మమ్మనాచార్యులవారు అడిగారు.

"అయ్యా!" అని ప్రారంభించారు వల్లభరాయుడుగారు. "భగవంతుడు మనకిచ్చిన ఈ సంపదను సద్వినియోగం చేస్తున్నాని నా ఉద్దేశం. రాజోద్యోగినీ, రాజ బంధువునుగానీ-డబ్బుకు కావలాదారును కానుగదా" అన్నాడు వల్లభరాయుడు.

ప్రభువులవారు తమలో తాము నవ్వుకొన్నారు.